



స్టార్టింగ్ ట్రబుల్

మనమెక్కిన జీపో, కారో కదలకుండా మారాం చేస్తున్నప్పుడు గుండెల్లో దడగా ఉంటుంది. గొప్ప కోసం ఎక్కుతామే కానీ కదలకపోతే తొయ్యడానికి కాదు గదా, అది ట్రబుల్లో ఉన్నప్పుడు డ్రైవరు మనల్ని ఎక్కడ దిగమంటాడోనని భయం, దిగులు. దిగి తోయండని ఆర్డరేస్తాడేమోనని కారెక్కిన వాళ్ళలో హోదాపరంగా ఎవడు పెద్దో, ఎవడు చిన్నో మనసులో పరిశోధన ప్రారంభిస్తాం. ఒకవేళ దిగి తోయడమే తప్పని సరైతే ముందు ఎవడు దిగాలో కూడా అంచనా వేసుకుంటాం. ఖర్మకాలి అట్లాంటి పనికి మనమే మొదటి వారమైతే ఎరక్క చిక్కడినందుకు విలవిల్లాడి పోతాం.

స్టార్టింగు ట్రబులనే మాట బాగా వాడుకలో ఎందుకొచ్చిందోగానీ దాంతో గొప్ప గొడవగా వుంటుంది. కారునీ, జీపునీ వదిలేయండి నిత్య జీవితంలో చాలా సందర్భాలలో ఈ ట్రబులు ప్రత్యక్షమవుతూ వుంటుంది. కొత్తగా వుద్యోగంలో చేరినపుడు ముందర ఆరునెలలో, ఏడాదో ప్రొబేషను పిరియడంటూ ఒక పద్ధతిలో వుంచుతారు. అంటే స్టార్టింగు ట్రబులు పిరియడని అర్థం. ఏ ఫైలు ఏట్లా రాయాలో....సెలవకెన్ని అబద్ధాలు చెప్పాలో, ఆఫీసులో లేటుగా ఎప్పుడు వచ్చి, అర్లీగా ఎప్పుడు వెళ్ళిపోవాలో వగైరా పద్ధతులన్నీ ఆ కాలంలో అర్థమవుతాయి. కంగారూ, భయం, బెరుకు మొత్తం దూరమయి పోతాయి. ఇక అక్కణ్ణుంచి ఒకటే వరస. బండికి స్పీడెక్కుతుంది.

పెళ్ళి జీవితంలో చాలా ముఖ్యమైన ఘట్టం. నూరేళ్ళ పంట. అంతకు ముందు వారెవరో వీరికి తెలియదు. వీరెవరో వారికి తెలియదు. అట్లాంటి ఇద్దరు వ్యక్తులు జీవితాంతం కలిసి వుండాలి. శుభలేఖలు అచ్చు వేసినప్పట్నుంచి ప్రారంభమవుతుంది ఆందోళన. అట్లాంటప్పుడు స్టార్టింగు ట్రబుల్ తథ్యం. మూడు ముళ్ళకి బదులు ముప్పై ముళ్ళు వేయక పోయినా, తాళికట్టే సమయంలో థ్రిల్‌తోపాటు కొంత అలజడి కూడా వుంటుంది.

మా సుబ్బిగాడి పెళ్ళి గొప్ప గోలగా జరిగింది. వాణ్ణీ, వాడి పెళ్ళాన్నీ గుమ్మం దగ్గర నించోపెట్టి పేర్లు చెప్పమన్నారు. అమ్మాయి నిక్షేపంగా చెప్పేసింది. సుబ్బిగాడు మాత్రం బెల్లం కొట్టిన రాయికి మల్లే, నీళ్ళు నముల్తూ నిల్చుండి పోయేడు. అయిదు, పది, పావుగంట గడిచినా నోరు విప్పలేదు. సిగ్గను కున్నారు కొందరు. కాదు భయమనుకున్నారు. అసలు రహస్యమేమిటంటే సుబ్బిగాడు అమ్మాయి పేరు మరిచిపోయేడు. అంత వరకూ ఫర్లేదు, రక్షించేడు. అదే గనక నోటి కొచ్చిన పేరేదో చెప్పి వుంటే....సుగుణ బదులు సుందరి అన్నాడనుకోండి. గోవింద! తాడు తెగి పోయి వుండేది. బతికినంత కాలమూ నిత్య సాధింపులతో చచ్చేవాడు.

ఉపన్యాసాల్లో స్టార్టింగు ట్రబులు చిత్ర విచిత్రంగా వుంటుంది. మైకుముందు నిలబడ్డ ఆసామికి నోరు స్వాధీనం తప్పుతుంది. చేతులూ,

కాళ్ళు టైప్ మిషన్లలాగా టపటపమని వణుకు తుంటాయి. దిక్కులు చూస్తాడు. మైకుని చేత్తో రాస్తాడు. ఏదో ఆలోచిస్తున్నట్టు ఫోజు పెడతాడు. గడ్డం మీద చేత్తో తడుంకుంటాడు. ఏదో అందామనుకుని ఆర్యా అంటాడు. తర్వాత ఏం చెప్పాలో బోధపడదు. వేదిక మీదున్న పెద్దల పేర్లు మరచి పోతాడు. ఆహ్వాన పత్రికోసం జేబులు వెతుక్కుంటాడు. అది బల్లమీద కనిపిస్తుంది. తీసుకోవాలంటే సిగ్గు. పెద్దల మొహాలన్నీ వెర్రి మొహంతో చూస్తాడు. వెకిలి నవ్వు నవ్వుతాడు. చేసేది లేక అధ్యక్షా అంటాడు. పున రుక్తికి బాధపడతాడు. సోదర, సోదరీమణులారా అని ఛీ ఛీ బాగోలేదని మనసులో అనుకుంటాడు. డియర్ ఫ్రెండ్స్ అంటాడు. తెలుగుతప్ప మరో భాష రాని కారణంగా స్నేహితులారా అని దిద్దుకుంటాడు. ఈ విధంగా అయిదారు నిముషాలు మైకు దగ్గర నాట్యం చేస్తాడు. ప్రేక్షకులు క్షమించేరా గండం గడుస్తుంది. ఆపైన ధారాళంగా పడతాయి పదాలు. లేదా ఆ ఇబ్బంది మరీ చెప్పనక్కర్లేదు.

ప్రభుత్వాల్లో కూడా స్టార్టింగు ట్రబులు తప్పటం లేదు. అందుచేతనే వాళ్ళు ముందు జాగ్రత్తలు తీసుకుంటారు. పదవికాలం అయిదేళ్ళలో అద్భుతాలు చేస్తాం. పదేళ్ళలో పేదరికానికి స్వస్తి చెబుదామంటారు. ఎనిమిదేళ్ళకే పూర్తి మద్యపాన నిషేధం అమలు పరుస్తామంటారు. ఏడేళ్ళలో నిరుద్యోగాన్ని కాల్తో తన్ని, గెటవుటంటామని హామీ యిస్తారు. ఇట్లాంటివి మనం పట్టించుకోకూడదు. స్టార్టింగు ట్రబులు అక్కడ కూడా ఉంటుందని అర్థం చేసుకోవాలి.